అంబేద్కర్ కాని, ఆయన నిమ్నజాతి సమాఖ్య కాని చేసివుండలేదని చెప్పడం నిస్సందేహం. హరిజన దేవాలయ ప్రవేశచట్టాలు చేసింది కాని, చట్టరీత్యా అస్పృశ్యతను శిక్షార్హమైన నేరంగా చేసింది కాని, హరిజనులకు ఉచిత విద్యా సౌకర్యాలు కల్పించి, వారికి సమాజంలో మిగిలినవారితో సమాన ప్రతిపత్తిని రాజ్యాంగ రీత్యా కలిగించింది కాని, వారిని మంత్రులుగా, శాసనసభ్యులుగా, శాసనసభ స్పీకర్లుగా నియమించింది కాని కాంగ్రెస్ సంస్థయే కాని; డాక్టర్ అంబేద్కర్, ఆయన నిమ్నజాతి సమాఖ్య కాదుకదా. హరిజనోద్ధారకుడననే పేరుతో బ్రిటిషు ప్రభుత్వ పరిపాలనా కాలంలో కాని, అటుపిమ్మట స్వతంత్ర భారత ప్రభుత్వంలో కాని డాక్టర్ అంబేద్కర్ ఏవో కొన్ని ఉన్నత పదవులు సంపాదించడం మాత్రమే జరిగింది కాని, హరిజనాభ్యుదయానికి ఆయన కించిత్తుకూడా కృషిచేసి వుండలేదు.

హరిజనుల తరఫున మాట్లాడడానికి కాని, వారి నాయకుడనని చెప్పుకొనడానికి కాని డాక్టర్ అంబేద్కర్‌కు ఏమి హక్కు వున్నది? ఆయన గత సంవత్సరమే బౌద్ధమతాన్ని స్వీకరించాడు. అయినప్పుడు బౌద్ధుడైన డాక్టర్ అంబేద్కర్‌కు హిందూ సంఘానికి చెందిన హరిజనులకు నాయకుడనని చెప్పుకొనడానికి కాని, వారి తరఫున మాట్లాడడానికి కాని అర్హత యెక్కడవున్నది? ఈయన ఇదివరలో ఒక పర్యాయం సిక్కుమతాన్ని స్వీకరించాడు. ఆ పిదప ఇస్లామ్‌మతం స్వీకరిస్తానని బెదిరించాడు; ఇప్పుడు బౌద్ధమతాన్ని తీసుకున్నాడు. రేపు ఏమతం తీసుకుంటాడో ఎవరికి ఎరుక? కనుక ఈ చపలచిత్తపు రాజకీయవేత్త అవకాశవాదాన్ని, ఈ చర్చిల్, జిన్నాల ప్రియమిత్రుని నిజస్వరూపాన్ని హరిజనులు ఇప్పటికైనా గుర్తించి, "మీ నాయకత్వం మాకు అవసరంలేదు. మా నాయకులు—శ్రీ జగ్‌జీవన్‌రామ్, శ్రీ వి. ఐ. మునుస్వామి పిళ్లై, శ్రీ పృథ్వీసింగ్ ఆజాద్, శ్రీ బి. ఎస్. మూర్తి ప్రభృతులు—మాకు వున్నారు. కనుక, మీరు మీ బౌద్ధులకు నాయకత్వం వహించండి" అని చెప్పడం అవసరం. ఎన్నికలకు పిదప చెప్పి ప్రయోజనంలేదు కదా!

---

# పరీక్ష తేల్చిన కన్య

## అవసరాల రామకృష్ణారావు

గడియారం కొట్టిన గంటలు వకీలుగార్ని కౌగిలించి బాహ్య ప్రపంచానికి యీడ్చుకు వచ్చాయి. "అయ్యో ఏడుకొట్టేశాయే! వాసుకి యెనిమిదింటికి ఎకనామిక్సు పరీక్ష. ఇంకా లేవలేదు కాబోలు. చూడవే!" అని యింట్లోకి ఒక్క కేక పెట్టేరు. కవళమ్మ మరుగుతున్న పాలు కిందకుదింపి తలుపుదగ్గిరకు వేసి కొడుకు పడకగదిలోకి వచ్చేసరికి యివీ మాటలు:

"నాన్నా, ఆ చిన్నారికన్నె ఏదీ?" కవళమ్మ ఆ మాటలు విని ముసిముసి నవ్వులు నవ్వుతూ భర్తను వెంటబెట్టుకుని తిరిగి కొడుకు గదిలోకి వచ్చింది.

"వెన్నెలలో నా కన్నులలో వన్నెలవలపన్నిన ఆ అన్నుల మిన్ననుగాని కన్నారా నాన్నా?"

పకపక నవ్వుతూ భర్తవైపు మనసుగా చూసింది కవళమ్మ. పైకి నవ్వొస్తున్నా యించుమించు ఏడుస్తూ వకీలుగారు వెర్రి నవ్వొకటి పైకి రానిచ్చి-

"యతి ప్రాసలతోనూ యమకాలతోనూ పలవరిస్తున్నాడే మనవాడు! భేషూ మరేంలేదు కమలా, కొస్త అల్లప్పచ్చడి ఆరారా పెట్టు. తెలుగుపుస్తకాలు తెగ చదివి ప్రకోపించిన ఆ పైత్యం ఠక్కున కట్టేస్తుంది" అన్నారు

"ఇంగ్లీషులో మాత్రం పలవరింతలు ఉండవూ?" అనుకుంది కవళమ్మ. పైకిమాత్రం యిలా అంది:

"ఎందుకొచ్చిన కబుర్లు పోనిద్దురూ! ముందు పెళ్ళి చెయ్యండి తరువాత చదువు మాట చూసుకుందాం అంటే నామాట విన్నారు కాదు. సముద్రపు కెరటాలు తగ్గనీ, స్నానం

చేస్తాను, అనే రకం మీది. ఎలా కుదురుతుంది? ఎనిమిదింటికి పరీక్ష పెట్టుకుని ఏడింటికి ఏడు యివీ పలవరింతలు! పరీక్షలంటే ఓ భయమూ భక్తీ లేవు. ఎంతెంత పరీక్షలయినా చిరునవ్వుతో యెదుర్కొంటాను మా చిన్నినాన్న!"

"వెర్రి నవ్వుతో వెనక్కి వస్తాడు కూడాను మీ చిన్నినాన్న! ఏనుగు గున్నేం కాదూ: చాలా సంతోషించాం గాని ముందు వాడిని యీ అరగంటలోగా ఏమయినా కదల్చగలవేమో ప్రయత్నించు."

వకీలుగారు గదిలోకి వెళ్ళిపోయారు.

"మళ్ళీ కొత్త ఫైల్సు తియ్యకండి. కాఫీ తెస్తున్నాను." తలకింద చేతులు పెట్టుకుని సాలోచనగా పడక కుర్చీలో కూలబడ్డారు వకీలుగారు.

ఒక ,పావుగంటలో కవళమ్మ కాఫీ కప్పు అందించింది.

"ఏం చేస్తున్నాడు వాడు?"

"మొహం కడుక్కుంటున్నాడు పెరట్లో. నేను వాడికి తల్లినై యిలా చెప్పకూడదుగాని మీరైనా నా మాట వినండి. ఎందుకు చెప్పండి వాణ్ణి బాధపెట్టడం మీరు బాధపడడమూను? ఆ పెళ్ళి ముచ్చట ఏమిటో తీర్చెయ్యండి. అటుపైని చక్కగా చదువుకుంటాడు. వాణ్ణి వేధిస్తే ఏం లాభం? పరీక్షో పరీక్షో అంటారు. మిమ్మల్ని మీరు సరిగ్గా పరీక్షించుకుంటే యీ మాట అంటారా? ఎందుకీ పరీక్షలు? ఎవర్ని ఉద్ధరించను? జీవితంలో యెదుర్కోవలసిన అనేక పరీక్షలున్నాయి. సరి అయిన సహచరిని వెదుక్కోవడం జీవితంలో మొదటి పరీక్ష..."

"పిల్లల్ని కనడం రెండో పరీక్ష. గోళ్ళు కొరుక్కుంటూ యింట్లో కూర్చోడం మూడో పరీక్ష. అహాహా! తల్లివంటే నిన్నే చెప్పుకోవాలి. మా చక్కటి బోధ కదూ! మా అత్తగారు చిన్నప్పుడు నీకెంత వస పట్టిందో గాని వినలేక చస్తున్నాం, యీ పాటికి ఊరుకుందూ?"

"మీకంత హేళనగా ఉంది. ఎక్కడా చెల్లకపోయినా మీ ప్లీడరీ అంతా నాదగ్గర ఉపయోగిస్తే నే చెప్పలేనుగాని నా మాట మీరు అర్థం చేసుకోరు, చెబితే వినరు. వాడి చేత బలవంతాన మీరు రాయించగలరూ? కిందటేడు పాసయ్యాడా, ఈయేడు పాసౌతాడా?"

"నాతో యిన్నాళ్లు కాపురం చేసి యీ మాత్రం అనుభవం సంపాదించకపోతే ఎందుకే నువ్వు? క్రిందటేడు ప్యాసవలేదంటే ఆ ఎగ్జామినరు అసాధ్యుడు. కొరుకుడు పడ్డాడు గాదు. స్కూలు ఫైనలునుంచీ మనవాడు పలవరిస్తూనే ఉన్నాడు, దానికి నేనేం చెయ్యను? అవన్నీ లెక్కచేస్తే ఎలా? వీడీనాడు బియ్యేలోకి వచ్చాడంటే అదంతా స్వప్రయోజకత్వమేనా యేమిటి? స్కూలు ఫైనలుకి నాలుగొందలు, ఇంటరుకి వెయ్యి తగలేశాం కాదు మరి? ఈ బియ్యే కాస్తా అయిందనిపిస్తే అతను నాలుగు రెట్లు రాబట్టకోమూ? ఆ మాత్రం బోధపరుచుకోకపోతే యెందుకే నువ్వు?"

"మీకు జీవితం అంతా వ్యాపారంగా కనిపిస్తున్నట్లుంది. సరే నేను చెప్పేదేముంది? ఒకరు ఒత్తిడిపై కలిగించిన ఆకర్షణ కంటే- తన మనస్సుకి కలిగిన ఆకర్షణకే లొంగిపోతాడు మానవుడని నా నమ్మకం... ఇది వాడికి కాదు పరీక్ష... మన యిద్దరికీనూ... చూద్దాంగా."

"చూద్దాంగా."

టకటక నడుచుకుంటూ వచ్చి గదంతా శబ్దమయం చేశాడు వాసు.

"పెన్‌లో యింకు పోసుకున్నావా? హాలు టిక్కట్టు తీసుకున్నావా? జాగ్రత్త, పేపరు చూడగానే ఒళ్లుమరచి కళ్లుచెమర్చి చక్కా రాకు, బాగుండదు. ఏదో ఆ అరగంటా ఉండు. కొంపతీసి పేపరు మీద నీ అన్నులమిన్నను చిత్రించేవు గనుక! నెంబరు మాత్రం మరచిపోక వెయ్యి. ఆ తరువాత నేనుండ నేనున్నాగా చూసుకుందాం - ఏదేనా మంచి శకునం చూడవే."

"మీరెలాగా ఉన్నారుగా తరువాత! శకునం కూడా యెందుకూ?"

"అదేం మాటే అపశకునపక్షీ- మంచి ఎగ్జామినరు, సులువుగా కొరుకుడుపడేవాడు దొరకొద్దూ?"

"పాపచింత గలవారికి నమ్మకాల పిచ్చి ఎక్కువ కాబోలు" అనుకుంది కవళమ్మ. వాసు వకీలుగారు, వీధిలోకి వచ్చారు. పది నిముషాలయినా అదేం చిత్రమోగాని ఒక్క సరిఅయిన

శకునం వస్తే ఒట్టు. "ఇదేం చాదస్తమండీ, ఆ పుణ్యకాలం కాస్తా అవగొట్టెయ్యండి, తీరిపోతుంది. చాలు చేశారు గాని నే యెదురుగుండా వస్తానుండండి."

"చాలు చాలు, ఆమధ్య వచ్చి మరెప్పుడూ పిలవకుండా నువ్వేకదూ కట్టుదిట్టం చేసుకున్నావ్... ఉండుండు... దూరంగా చూశావా ఆచివర్ని కనపడ్డంలేదూ ఆకుపచ్చచీరాపిల్లాను."

"అవునవును- ఎంత బాగుందో! సాక్షాత్ పార్వతీదేవిలా ఉంది సుమండీ. యిలా తిన్నగా మన యింటికే వచ్చేస్తే ఎంత బాగుండునండీ."

"సరే యిప్పుడు ఆ వర్ణనెందుకు? పద వాసూ. ఏమిటలా చూస్తూనిలబడిపోయావ్. వెళ్లు వెళ్లు. నెంబరు వెయ్యడంమరచిపోకు. జాగ్రత్త."

"కవళమ్మ యింట్లోకి వచ్చేసింది. వాసుని దిగనిచ్చి వకీలుగారు తలుపేసుకున్నారు. ఆపిల్ల ఆ పక్కవీథిలోకి మళ్ళిందనీ, కూడా వాసు వెళ్ళేడనీ వాళ్లకేం తెలుసూ?

ఏమీ ఎరగని గోడ గడియారం ఏడు కొట్టింది. సంబంధంలేని సూర్యుడు చాటుకు పోయాడు. వెలుగుస్థానాన్ని చీకటి ఆక్రమించుకుంది. వాసు రాలేదు. వకీలుగారి కంగారుకి అంతులేదు. వెలిగించిన సిసింద్రీలా ఆయన కోపంతో చిందులు తొక్కుతున్నారు.

"నెంబరేసి రమ్మన్నాను- వెధవ... వెధవన్నర వెధవ. ఏమయినా రాయలా ఏడవాలా? తరువాత నేనేదో ఏడుస్తానన్నాను. అదీ బరువయిపోయిందా. ఇంతకన్న ఎగదోసేవాడెవడు బాబూ!"

గుమస్తా వచ్చి ఏదో చెప్పి వెళ్ళేడు. ఆయన ఆ కబురు విని మరీ మండిపడిపోతున్నారు. కవళమ్మ పిల్లిలా భయపడుతూ యివతలి కొచ్చింది.

"విన్నావా కమలా నీ కొడుకు ప్రయోజకత్వం? పరీక్షకేనా వెళ్ళలేదట వెధవ. వాడి సొమ్మేం పోయిందీ? మళ్ళీ చచ్చినట్టు ఏటికేడాదీ పుస్తకాలూ, జీతాలూ, రికార్డులూ నాతాడు తెగొద్దూ? ఎబ్రాసి వెధవ ఎక్కడేడుస్తున్నాడో!"

"నేముందే చెప్పలేదుటండీ, వాడి పేరుకి ఆ రెండక్షరాలూ యెంత త్వరగా అంటగంటి కట్నం పిండుదామా అని చూస్తున్నారు మీరు. అవి రెండూ ఎంత త్వరలో దులుపుకుని తిరుగుదామా అని చూస్తున్నాడు వాడు! పెళ్లి చేస్తేగాని పిచ్చి తగ్గదు, పిచ్చి తగ్గితేగాని పెళ్ళవదు అన్నట్టుంది మీ తంతు! అయినా మీరు వెనకేగాని, వాడి యెదురుగుండా ఒక్కమాటనలేరండీ యెంచేతో గాని" నిప్పుమీద ఉప్పేసినట్టు యీ మాటలు విని వకీలుగారు మరీ చిటపట లాడిపోయారు.

"చాలు, నోర్ముయ్. నిన్నెవరూ అడగలేదు విమర్శలూ, తీర్మానాలూనూ. నువ్వు వాడిని వెనకేసుకు రాబట్టే యింతా వచ్చింది. పెళ్ళో పెళ్ళో అని వాడి ముందే గోలెడితే వాడేం జ్ఞానం లేని పసిపాప గనుకనా? అంతా నీ బోధే. నీ వల్లే వాడు..."

మాట పూర్తవకుండా తలుపు తెరచుకుంది. ముందు వాసూ, తరువాత కవళమ్మ పొద్దుట చూసిన పార్వతీ దేవీను.

వకీలుగారూ, కవళమ్మా ఒకరి మొహా లొకరు చూసుకొన్నారు. అదిచూసి వాసూ, జయా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"రా, మొహమాట పడకు. వాళ్ళిద్దరూ ఎవరో నీకు తెలుసుగా" ఆ పిల్ల ఏదో గ్రహించినట్టు వారిద్దరికీ నమస్కరించింది. కవళమ్మ "ఏమైంది మీ పరీక్ష?" అన్నట్టు భర్తవైపు చూసింది. వకీలుగారి వాక్కు పడిపోయింది. కవళమ్మ ఆ పిల్లను చేరదీయడం చూడలేక ఆయనఆఫీసుగదిలోకిపోయి తలుపేసుకున్నారు.

"అమ్మా! యిన్నాళ్ళూ నాన్న నన్ను ఎరగా చూపి డబ్బుతో డిగ్రీలు కొనిపెట్టేరు. పరీక్షలు ప్యాసు చేయించారు. ఇన్నాళ్ళూ ఆయనచేతిలో నే కీలుబొమ్మని. నేనుస్వయంగా చేసిన పనీ, ప్యాసయిన పరీక్షా ఒకటీలేదు. ఇదిగో యింత సేపూ సంప్రదించుకుని ఓ నిర్ణయానికి వచ్చాం. నేను మొదటిసారి సంతృప్తిగా స్వయంగా చేసినపనీ, జీవితంలో మొదటిసారిగా ప్యాసయిన పరీక్షా ఏమయినా ఉంటే యీ మే."

ఆఅమ్మాయితలని కవళమ్మ ప్రేమతో నిమిరింది.

"నా యిన్ని వేలూ ఏం కాను? నే తగలేసిన యిన్ని వందలూ ఎలా రాను?" అని తల బాదుకున్నాడు గదిలో వకీలుగారు!